పక్కపక్కనే రెండు గ్రామాల పంచాయతీ కార్యాలయాలు

రెండు గ్రామాల పంచాయతీ భవనాలు పక్కపక్కనే ఉన్నాయి. అదేంటీ..? ఎలా సాధ్యం అనుకుంటున్నారా..? ఇలా సాధ్యం అయ్యింది మరీ.. నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట. గోపాల్‌పేట గ్రామపంచాయతీలో గతంలో నాగిరెడ్డిపేట, బంజారా గ్రామాలు హామ్లెట్ గ్రామాలుగా ఉండేవి. గోపాల్‌పేటలో గ్రామ పంచాయతీ భవనం ఉండేది. గోపాల్‌పేట ప్రధానరహదారిపై ఉండడంతో ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, వ్యాపార సముదాయాలు ఏర్పాటయ్యాయి. 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. నాగిరెడ్డిపేట, బంజారా గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. నాగిరెడ్డిపేట ప్రజాప్రతినిధులు, ప్రజలు తమకు గోపాల్‌పేటలోనే పంచాయతీ కార్యాలయం ఉండాలని కోరారు. దీంతో అధికారులు గోపాల్‌పేటలోనే నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారు. అప్పటి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.22లక్షలు మంజూరు చేశారు. దీంతో గోపాల్‌పేట జీపీ భవనం పక్కనే నాగిరెడ్డిపేట జీపీ భవనాన్ని నిర్మించారు. రెండు గ్రామాల పంచాయతీ భవనాలు పక్కపక్కనే ఉండడంతో ఏది తమ గ్రామ పంచాయతీ భవనమో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు.

– నాగిరెడ్డిపేట, మే 2

గుట్కాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం

కిరాణా దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డి/ పెద్దకొడప్‌గల్/ గాంధారి, జూన్ 2: నిషేధిత గుట్కాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిలోని పలు కిరాణా దుకాణాలను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. గుట్కాలను విక్రయించి ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగించొద్దని తెలిపారు. గుట్కాలతో క్యాన్సర్ వ్యాధి వస్తున్నదని, దీంతో ప్రభుత్వం వాటిని నిషేధించిందని వివరించారు. కాగా.. శనివారం పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించడంతో యజమానులు ముందు జాగ్రత్తగా గుట్కాలను రహస్య ప్రదేశాల్లో దాచిఉంచినట్లు సమాచారం. పెద్దకొడప్‌గల్‌లో ఎస్సై కోనారెడ్డి తమ సిబ్బందితో కలిసి కిరాణా దుకాణాలు, పాన్ షాపులపై దాడులు చేశారు. నిషేధిత గుట్కాలు, అంబర్, గుడుంబా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయిశివ, అంజి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో తనిఖీ చేపట్టి మహదేవ్, లక్ష్మీ, నారాయణ కిరాణా దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయనవెంట ఏఎస్సై గంగారాం తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్‌లోని కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తెలంగాణ ఉద్యమంలో
కవులు, రచయితల పాత్ర కీలకమైంది

భాస్కర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న రచయితలు

సుభాష్‌నగర్, జూన్ 2: ఉద్యమాలు నిర్మించి ప్రజలను మమేకం చేసి విజయతీరాలను చేర్చేది కవిత్వమని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీ శంకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం అధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మద్దుకూరి సాయిబాబు రచించిన అనుపమానం అన్నదానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వీ శంకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకాలం, పునర్నిర్మాణం, అభివృద్ధిలో కవులు, రచయితల పాత్ర కీలకమన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవ పురస్కారాన్ని జేఏసీ చైర్మన్ మోరేశ్వర్ భాస్కర్‌కు అందజేసి అభినందించారు. ప్రముఖ కవి ఘనపురం దేవేందర్, సీహెచ్ ప్రసాద్, పంచరెడ్డి లక్ష్మణ్ తదితరులు మాట్లాడుతూ.. ఉద్యమ కాలంలో కవులు, రచయితల పాత్రను వివరించారు. 'మంచి కవిత్వం' శీర్షికన 30 మంది కవులు తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, తిరుమల శ్రీనివాస్ ఆర్యా, డా. కాసర్ల నరేశ్ రావు, చెన్న శంకర్, కంకణాల రాజేశ్వర్, అన్యం పద్మజారెడ్డి, రేణుక, మఠం సుజాత, దారం గంగాధర్, తొగర్ల సురేశ్, దైవసాని కైలాస్, నాగం సాయిలు, పురం శంకర్, వేణుగోపాల్, ప్రవీణ్, తెలంగాణ ఉద్యమకారుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత

కామారెడ్డి, జూన్ 2: కామారెడ్డి బల్లియా పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన చీకోటి రాములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉన్నాడు. దీంతో బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల బీమా మంజూరైంది.ఇందుకు సంబంధించిన చెక్కును కామారెడ్డిలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రాములు కుమారుడు భరత్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్, నాయకులు బలవంతరావు, రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

విద్యుత్ ఉద్యోగులకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు

అవార్డును అందుకుంటున్న ఉద్యోగులు

ఖలీల్‌వాడి, జూన్ 2: నిజామాబాద్ జిల్లాకు చెందిన తొమ్మిది మంది విద్యుత్ ఉద్యోగులు బెస్ట్ ఎంప్లాయ్స్ అవార్డులను అందుకున్నారు. హనుమకొండలోని టీజీ ఎన్‌పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎండీ ఐఏఎస్ కర్ణాటి వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులను అందుకున్నవారిలో నిజామాబాద్ ఎస్ఈ రవీందర్ , ఏడీఈ ఓపీ సుహాసిని(నవీపేట్), ఏడీఈ తోట రాజశేఖర్ (నిజామాబాద్), ఏఈ రాజేందర్(బర్దీపూర్), ఏఏఈ సుమిత (నిజామాబాద్), కృష్ణ (కోటగిరి), గంగాశేఖర్(సుభాష్‌నగర్), ఎల్ఎం చంద్రకాంత్ (బోధన్ -1), శివకుమార్ (దేగాం) ఉన్నారు.

నిజాయితీని చాటుకున్న మహిళా కానిస్టేబుల్

వినాయక్‌నగర్, జూన్ 2: జిల్లా కేంద్రంలో ఓ యువకుడు పోగొట్టుకున్న పర్సును అతడికి అందజేసి నిజాయితీని చాటుకున్నది మహిళా కానిస్టేబుల్. నగరంలోని ధర్నాచౌక్ వద్ద ట్రాఫిక్ మహిళా పీసీ అర్చన ఆదివారం విధులు నిర్వరిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఆర్మూర్ పట్టణానికి చెందిన అభిలాష్ (బూత్ లెవల్ ఆఫీసర్) ఆర్టీసీ బస్సులోంచి ధర్నా చౌక్ వద్ద దిగుతున్న సమయంలో అతడి జేబులో నుంచి పర్సు కింద పడింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ గమనించి వెంటనే పర్సును తీసుకొన్నారు. పర్సులో ఉన్న ఆర్సీపుస్తకంలోని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అభిలాష్ వెంటనే అక్కడికి చేరుకోగా.. అతడికి పర్సును అందజేశారు. పోగొటుకున్న తన పర్సును భద్రంగా తనకు అందజేసిన మహిళా కానిస్టేబుల్‌కు అభిలాష్ కృతజ్ఞతలు తెలిపాడు. నిజాయితీ చాటుకున్న మహిళా కానిస్టేబుల్‌ను ట్రాఫిక్ ఏసీపీ, సీఐతో పాటు తోటి సిబ్బంది అభినందించారు.

పర్సును అందజేస్తున్న కానిస్టేబుల్ అర్చన

సాగునీటి కోసం ఆందోళన వద్దు

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, జూన్ 2 : నిజాంసాగర్ నుంచి సాగునీటిని అందించే విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, గత పంటకు వదిలిన విధంగానే పొలాలకు నీటిని అందిస్తామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడారు. నిజాంసాగర్ నుంచి అలీసాగర్, బోధన్‌కు 0.2 టీఎంసీల(200 ఎంజీఎఫ్) నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్నారని తెలిపారు. అనంతరం మిగిలిన నీటిని నిజాంసాగర్ ఆయకట్టు రైతాంగం పొలాలకు వానకాలం పంటలకు విడుదల చేస్తారని తెలిపారు. గత పంటల మాదిరిగానే ఈ వానకాలం పంటకు సాగునీరు అందుతుందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి అలీసాగర్‌కు తాగునీటి విడుదల పూర్తయిన వెంటనే కెనాల్ వెంట తూములకు ఉన్న వెల్డింగ్‌లను తొలిగిస్తారని చెప్పారు. తాను నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. ముందస్తు నారుమడ్లు వేసుకున్నవారు తొందరపడొద్దని, నారుమడ్లు వేయని వారు వేసుకోవాలని సూచించారు.

రాబడి

మీ వాహనానికి థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ ఉందా?



దేశంలో వాహనదారులకు మోటార్ బీమా తప్పనిసరి. మీకు కారున్నా.. బైకున్నా.. లేదా మరే వాహనం ఉన్నా.. వెహికిల్ ఇన్సూరెన్స్ నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఇది మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 నిబంధన. కాబట్టి ప్రతీ వాహనదారునికి మోటార్ ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాల్సిందే. అయితే చాలామంది మొక్కుబడిగా ఏదో ఓ ఇన్సూరెన్స్‌ను తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి బయటపడితే చాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రకమైన వైఖరి చాలాచాలా నష్టపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పాలసీ కొనుగోలులో ఈ పొరబాట్లు వద్దు

- మీ ప్రాధాన్యతలను గుర్తించకపోవడం
- అసంపూర్ణ కవరేజీతో కూడిన పాలసీలు
- యాడ్-ఆన్ కవరేజీని నిర్లక్ష్యం చేయడం
- వివిధ పాలసీలు, వాటి ప్రీమియంలను పరిశీలించకపోవడం
- నో క్లెయిమ్ బోనస్‌లను పట్టించుకోకపోవడం

సమగ్ర పాలసీ అవసరం

కార్ ఇన్సూరెన్సైనా, బైక్ ఇన్సూరెన్సైనా సమగ్ర రీతిలో ఉండాలి. మీరు తీసుకున్న వెహికిల్ ఇన్సూరెన్స్ మీ వాహనానికి ఓ భద్రతా వలయంలా రక్షణనివ్వాలి. కేవలం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌పైనే దృష్టి పెట్టకూడదు. ఉదాహరణకు ఒకవేళ మీ ఇంటి బయట పార్క్ చేసిన కారుపై దగ్గర్లోని ఓ చెట్టు కొమ్మ విరిగి పడింది. దీనివల్ల కారుకు బాగానే నష్టం వాటిల్లింది. లేదా ఉదయం లేచిచూసే సరికి మీ అపార్ట్‌మెంట్ అవతలనున్న మీ బైక్‌ను దొంగిలించారు. ఇలాంటి సందర్భాల్లో మీరు తీసుకునే బీమానే మీకు రక్ష. అలాగే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, అల్లర్ల వంటి వాటిలో నష్టం జరిగినా వాహన బీమా వర్తిస్తుందన్నది మరువద్దు. కాబట్టి అన్ని కోణాల్లో ఆలోచించి, ఆరా తీసి ఓ సమగ్ర పాలసీని తీసుకోవాలి.



థర్డ్-పార్టీ బీమా అంటే?

కార్ ఇన్సూరెన్స్, బైక్ ఇన్సూరెన్స్‌లో థర్డ్-పార్టీ బీమా చాలా ముఖ్యమైనది. మోటార్ ఇన్సూరెన్స్‌లో ఫస్ట్-పార్టీ వాహన యాజమాని (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు). సెకండ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను అమ్మినవారు (బీమా సంస్థ). థర్డ్-పార్టీ ఏదైనా ప్రమాదంలో మీ వాహనం వల్ల నష్టపోయినవారు, గాయాలపాలైనవారు, చనిపోయినవారు. చికిత్సకు వైద్య ఖర్చులు, ఆస్తి నష్టానికి నగదును ఈ కవరేజీలో బీమా సంస్థనే అందిస్తుంది. థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులన్నీ వాహనదారుడి నెత్తిపైనే పడుతాయి. కనుక తప్పకుండా అత్యుత్తమ బీమాను తీసుకోవాలి. గడువు దాటకముందే రెన్యువల్స్ చేస్తూపోవాలి. అయితే ప్రమాదంలో మీకు (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు), మీ వాహనానికి జరిగిన నష్టం మాత్రం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ పరిధిలోకి రాదు.

ఇది గుర్తుంచుకోండి..

సరైన వాహన బీమా పాలసీని తీసుకోవడం వల్ల మీ కారు, బైక్‌లకే కాదు.. మీకూ అనేక లాభాలుంటాయి. కాబట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మోటార్ ఇన్సూరెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయానికి రావాలి. ఈ క్రమంలో క్యాష్‌లెస్ గ్యారేజ్ నెట్‌వర్క్స్, ప్రీమియం ధరలు, యాడ్-ఆన్ ఫీచర్లు, బీమా సంస్థకున్న విశ్వసనీయత, కవరేజీ వంటి వాటిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. కాగా, మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ బ్రేక్‌డౌన్ జరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనం నడిపి ప్రమాదాలకు గురికావడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వంటి నిబంధనల ఉల్లంఘనల్లో కవరేజీలు వర్తించవు.

దీర్ఘకాలిక పెట్టుబడులే మేలు

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల సలహా

దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు.. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించాలని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలే మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 76,000 మార్కును, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 23,100 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. దీంతో ఈ ర్యాలీ వెనుక ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, బలమైన ఆర్థికాంశాలున్నాయని ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ఇన్వెస్టర్లు.. క్వాలిటీ స్టాక్స్‌ను కొనేందుకున్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సలహా ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు ఐదేండ్ల క్రితంతో పోల్చితే క్లీన్‌గా ఉన్నాయని, విస్తరణకు వీలు కూడా ఉందంటున్న విశ్లేషకులు.. ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని కూడా చెప్తున్నారు. కాగా, ఎన్నికలు, ఫలితాల దృష్ట్యా కొద్ది రోజుల వరకు మార్కెట్లలో ఒడిదొడుకులు తప్పవని కూడా పేర్కొంటున్నారు.

ఈ రంగాల్లో..

ఆటోమోటివ్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్స్యూమర్ డిస్క్రీషియనరీ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమిక్సల్ రంగాల షేర్లలోనూ పెట్టుబడులకు వీలున్నది. కాబట్టి ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు, అందుబాటులో ఉన్న నగదు నిల్వలకు, రిస్క్‌ను భరించే స్థాయికి అనుగుణంగా పెట్టుబడులకు వెళ్లవచ్చు. నిజానికి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బీఎస్ఈ సెన్సెక్స్ 4 శాతం వరకు పుంజుకున్నది. భారతీయ ఈక్విటీల్లో నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నా సూచీలు రికార్డు గరిష్టాలకు చేరడం కలిసొచ్చే అంశమేనని చెప్పవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఎఫ్‌పీఐలు దాదాపు రూ.21,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు మరి.

కంపెనీలు తమ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. చాలా సంస్థలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే వెళ్లాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను పరిశీలించవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలను ఆర్జించవచ్చు.

-తేజస్ ఖోడే, ఫీర్స్ వ్యవస్థాపక సీఈవో

స్టాక్ మార్కెట్లు పెరగడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. కనుక ఇది నిలకడైన ర్యాలీగానే చెప్పుకోవచ్చు. మున్ముందు సూచీలు మరింతగా పెరిగే వీలుందనే అనుకుంటున్నా. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులకు అనువుగానే భావించవచ్చు. ఇక ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తక్కువగా ఉన్నది. ఇంకా పెరగాలి.

-ఉపాసన భరద్వాజ్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త

పోర్ట్‌ఫోలియోల్లో వైవిధ్యం, బలమైన మూలాలున్న క్వాలిటీ స్టాక్స్‌లో పెట్టుబడులు, ఊహాజనిత ట్రేడింగ్‌కు దూరంగా ఉండటం వల్ల స్టాక్ మార్కెట్ రిస్క్‌లను మదుపరులు అధిగమించవచ్చు. ముఖ్యంగా స్వల్పకాలిక పెట్టుబడులకు వెళ్లకుండా కనీసం 2-3 ఏండ్లైనా దీర్ఘకాలిక పెట్టుబడులకు వెళ్లాలి.

-వినాయక్ మెహెతా, ఇన్ఫినిటీ గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్

నెలకు 2 లక్షల పెన్షన్ కావాలా?

ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ ప్లాన్ తెలుసుకోండిలా..

ప్రస్తుతం మీ వయసు 30 ఏండ్లైతే.. మీ పదవీ విరమణ అనంతరం నెలకు రూ.2 లక్షల పెన్షన్ కోసం రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ అవసరం.

ఇందుకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనువైనదిగా చెప్పవచ్చు. ఎన్‌పీఎస్ అనేది స్టాక్ మార్కెట్ లింక్డ్ స్కీమ్. ఇందులో పెట్టిన పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి ఏటా 10 శాతంగా ఉంటున్నది. అందుకే మెరుగైన మీ పెన్షన్ అవసరాలకు ఎన్‌పీఎస్ సరైనదని ఆర్థిక నిపుణులు సైతం అంటున్నారు.

నెలకు రూ.22,150

నెలనెలా దాదాపు రూ.22,150ని పెట్టుబడిగా పెడితే 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.5 కోట్లకు చేరుతాయి. చక్రవృద్ధి ప్రయోజనం ఇదే మరి. 30 ఏండ్లలో మీ పెట్టుబడులు రూ.79.74 లక్షలు. దీనిపై ఏటా 10 శాతం వృద్ధితో మరో రూ.4.21 కోట్లు సమకూరుతాయి. దీంతో కార్పస్ ఫండ్ రూ.5 కోట్లుగా ఉంటుంది. అప్పుడు నెలనెలా మీ రిటైర్మెంట్ వయసులో రూ.2 లక్షల పెన్షన్‌ను అందుకోవచ్చని పర్సనల్ ఫైనాన్స్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

ఇదీ సంగతి..

మీరు రిటైరైనప్పుడు మీకు రెండు మార్గాలుంటాయి. అవి ఓ యాన్యుటీ ప్లాన్‌లో మీ మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెట్టి పెన్షన్ తీసుకోవడమో లేదా రిటైరైన తర్వాత వచ్చిన ఆ సొమ్ములో 60 శాతం ఉంచుకుని, మిగతా 40 శాతంతో యాన్యుటీ ప్లాన్‌లో చేరడమో అవుతుంది. అయితే ప్రస్తుత ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) రేట్లను గమనిస్తే.. ఇంకా 6-7 శాతంగానే ఉన్నాయి. ఎఫ్‌డీల్లో నగదును పెట్టడం సురక్షితమే అయినా.. ఆశించిన లేదా ఆకర్షణీయ రాబడులు రావు. దీనికన్నా ఎన్‌పీఎస్‌లో పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. అయితే ఎన్‌పీఎస్.. మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటుంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో మెరుగైన రాబడులనే అందిస్తుందన్న నమ్మకం పెట్టుకోవచ్చు. కానీ పెట్టుబడులకు దిగే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకుంటే మరింత ధీమాగా ఉండవచ్చు.



మార్కెట్ పల్స్

ఫలితాలే దిక్సూచి

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలనే చవిచూశాయి. లోక్‌సభ ఎన్నికల భయాల నడుమ మదుపరులు లాభాల స్వీకరణకే పెద్దపీట వేశారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,449.08 పాయింట్లు క్షీణించి 73,961.31 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 426.40 పాయింట్లు పతనమై 22,530.70 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా సూచీలు నష్టాలనే మూటగట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి. మంగళవారం ఎన్నికల ఫలితాలు రానుండటంతో ఒడిదొడుకులకూ వీలున్నదని ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఈ వారం కూడా మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 22,100 పాయింట్ల స్థాయి కీలకం. దీనికి దిగువన ముగిస్తే 21,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,000-23,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.